సొంతిళ్లు నిర్మించుకోవాలని..

పనిచేస్తున్న ఇంటికే కన్నం

- రూ. 10 లక్షల విలువైన ఆభరణాలు చోరీ
- ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు
- మొత్తం సొత్తు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి. చిత్రంలో అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న డబ్బు, బంగారం

హైదరాబాద్ సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ముగ్గురు.. వారి సొంత ఇళ్లు నిర్మించుకోవాలనుకున్నారు. అందుకు తగినంత డబ్బులు లేకపోవడంతో ఏదైనా దొంగతనం చేసి డబ్బులు సంపాదించి ఊరిలో ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. తాము పనిచేస్తున్న ఇంటిపైనే కన్నేసి దొంగ తనానికి పాల్పడ్డారు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా ద్వారకాపురంకు చెందిన రేవు సురేష్, పశ్చిమగోదావరి తాడేపల్లిగూడెంకు చెందిన అవిటి పల్లారావు, తూర్పుగోదావరి జిల్లా నేలపర్తిపాడుకు చెందిన తౌటి సుబ్బారావులు బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి జూబ్లీహిల్స్‌లోని రోడ్డు నంబర్-54లో పలు ఇళ్లలో వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. ముగ్గురు ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో పరిచయం బాగా పెరిగి స్నేహితులయ్యారు. వారి వారి సొంత ఊరిలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అయితే అవి పూర్తి చేయడానికి తగిన డబ్బులు లేకపోవడం, వచ్చే డబ్బులు ఎటూ సరిపోకపోవడంతో ఏదో ఒక దొంగతనం చేసి వచ్చిన డబ్బుతో ఊరిలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా వారు పనిచేస్తున్న ప్రాంతంలో అదును చూసి జూలై-18న ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. రూ. 10లక్షల విలువైన గోల్డ్, డైమండ్, సిల్వర్ వస్తువులను చోరీ చేశారు. వాటిని జూబ్లీహిల్స్ వెంకటగిరి ప్రాంతానికి చెందిన యోగేష్ శాంతిలాల్ జైన్‌కు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. కొన్ని వస్తువులు అమ్మగా వచ్చిన రూ. 5లక్షల నగదు, మిగిలిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా కేసు దర్యాప్తు చేసిన క్రైమ్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తన టీమ్‌తో రంగంలోకి దిగి నిందితులను అరెస్టు చేశారు.



కొత్త చెరువు వద్ద పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి జీహెచ్‌ఎంసి అధికారులు

కొత్త చెరువు పరిసర ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరిస్తాం

బంజారాహిల్స్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్త చెరువు పరిసర ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలి సి ఆయన షేక్‌పేట కొత్త చెరువును మంగళవారం సందర్శించారు. సమస్యల గురిం చి ఆరా తీశారు. చెరువులో మురుగు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి సుందరంగా ఉంచేలా చూడాలన్నారు. కొత్త చెరువు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను గురి కావడంతో వాటిని అధికారిక దుకాణాల సముదాయాలుగా మార్చాలని ఆదేశించారు. అక్రమ పార్కింగ్‌లను తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులతో కలిసి పని చేయాలన్నారు. సందర్శకులు ప్రతినిత్యం కొత్త చెరువును సందర్శించేలా సుందీరకరణ చేపట్టాలన్నారు.

బంజారాహిల్స్ రోడ్లు విస్తరణ

అనంతరం బంజారాహిల్స్ రోడ్లను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం రోడ్డు విస్తరణ చేపట్టాల్సిన ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్డు నెంబరు 3/14, 10/11 తదితర రోడ్లను పరిశీలించారు. రోడ్డు విస్తరణ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యుఎంటీపీ ఎండి జీవన్, ఎస్ఈ రత్నాకర్, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ వీధుల్లో అంధకారం

- నెలల తరబడి వెలగని వీధిదీపాలు
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



ఖైరతాబాద్‌లోని ఓ వీధిలో కమ్ముకున్న చీకట్లు

ఖైరతాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని పలు ప్రాంతాల్లో దాదాపు ఐదు నెలలుగా వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. ఖైరతాబాద్‌లోని ఇందిరానగర్ కాలనీ, 2 బీహెచ్‌కే హౌసింగ్ కాలనీ, మహాభారత్‌నగర్, శ్రీనివాసనగర్, టీజేఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో చాలా చోట్ల దాదాపు ఐదు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో మహిళలు, వృద్ధులు ఈ ప్రాంతాల గుండా వెళ్లాలంటే భయపడుతున్నారు. మహాభారత్‌నగర్‌లో పలుచోట్ల రహదారులపై గుంతలు ఉండగా చీకట్లో అవి కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. శ్రీనివాసనగర్‌తో పాటు పలు బస్తీలలో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగని ప్రాంతాల్లో పోకిరీలు తిష్ట వేసి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మద్యంతో పాటు మత్తు పానియాలు సేవించి వచ్చిపోయే వారిని వెకిలిచేష్టలతో ఇబ్బందులకు గురి చేసున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. వీధి దీపాలు వెలగడం లేదని ఇప్పటికే పదులసార్లు ఫిర్యాదు చేసినా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో సంబంధిత అధికారులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించరని, ఫోన్ ఎత్తినా నిర్లక్ష్యపు సమాధానాలు చెప్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జోనల్ కమిషనర్, ఉప కమిషనర్లు స్పందించి సమస్య పరిష్కరించడంతో పాటు సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బయో వ్యర్థాలతో వ్యాపారం

- బస్తీప్రజలకు పొంచి ఉన్న ప్రమాదం
- ప్రైవేటు ఆస్పత్రులతో మాఫియా కుమ్మక్కు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీహెచ్‌ఎంసీ, పోలీసులు



పాత కల్లు కాంపౌండ్‌లో బయో వ్యర్థాలను వేరు చేస్తున్న మహిళా కార్మికులు.. మధ్యలో చిన్నారి

ఖైరతాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో రోగులకు వాడే సిరంజీలు, గ్లౌజ్‌లు, ఆక్సిజన్ కోసం వాడే మాస్క్‌లు, పైపులు, గ్లూకోజ్ బాటిళ్లు, శస్త్ర చికిత్సల కోసం వాడే పరికరాలు, రక్తంతో కనిపించే వైద్య పరికరాలను బయో వ్యర్థాలు. ఇవి చాలా ప్రమాదకరం. వీటి నుంచి అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు అధికం. ఈ బయో వ్యర్థాలను ఆస్పత్రులు జనసంచారం లేని ప్రాంతాల్లో పూడ్చాలి. మరి కొన్నింటిని కాల్చివేయాలి. కానీ కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అలా చేయడం లేదు. అవి మాఫియాతో కుమ్మక్కై బయో వర్థాలను అర్థ రాత్రి వేళల్లో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల నుంచి ఆకుపచ్చ, నల్లటి రంగుల్లో పెద్దపెద్ద ప్లాస్టిక్ బ్యాగుల్లో తరలించి వాటితో వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బయో వ్యర్థాల కారణంగా పేదలు తీవ్రమైన అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు బయో వ్యర్థాలతో వ్యాపారం చేస్తున్నాయి. మాఫియాతో కుమ్మక్కై వాటిని జనసంచారం ఉన్న ప్రాంతాలకు తెచ్చి పేద మహిళలతో వాటిని విభజింపజేసి అమ్మకొంటూ సొమ్ము చేసుకుంటోంది. ఈ వ్యవహారం నగర నడిబొడ్డున ఉన్న ఖైరతాబాద్‌లో సంవత్సరాల తరబడి జరుగుతోంది. అయినా అటు పోలీసులు, ఇటు జీహెచ్‌ఎంసీ పట్టించుకోకపోవడం లేదు. ఫలితంగా ఈ వ్యాపారాన్ని రోజురోజుకు విస్తరిస్తూ మరికొన్ని ప్రాంతాలకు వ్యాపించింది.

బస్తీలకు పొంచి ఉన్న ప్రమాదం

బయో వ్యర్థాలతో వ్యాపారం చేసే కేంద్రంగా కల్లు కాంపౌండ్ మారింది. పదుల సంఖ్యలో కార్మికులు ప్రమాదపుటంచున పని చేస్తున్నారు. రోగులకు వాడిన వైద్యపరికరాలతో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. అసలే రోగాలు, విష జ్వరాలు, వ్యాపిస్తున్న ఈ రోజుల్లో ఈ వ్యర్థాల నుంచి కార్మికుల ద్వారా స్థానిక టీజేఆర్‌నగర్, బుడగ జంగం బస్తీ, మారుతీనగర్ తదితర ప్రాంతాలకు వ్యాధులు ప్రబలే అవకాశాలున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ, పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రాణాంతక వ్యర్థాలతో వ్యాపారం జరుగకుండా అడ్డుకోవాలని కోరుతున్నారు.

ఉపాధి కోసం ఆరోగ్యాన్ని లెక్కచేయని పేదలు

ఖైరతాబాద్‌లో పాత కల్లు కాంపౌండ్ ఉండేది. ప్రస్తుతం అది కోర్టు వ్యవహారాలతో ఖాళీగా ఉంది. ఇందులో యజమానులు కొన్ని గుడిసెలు వేసి నిరుపేదలకు అద్దెకివ్వడంతో పాటు డబ్బుల కోసం కక్కుర్తి పడి బయో మాఫియా వ్యాపారం చేసే ముఠాకు అద్దెకిచ్చారు. గుడిసెల్లో చాలా మంది స్వచ్ఛ ఆటో టిప్పర్లు నడుపుకుంటూ కుటుంబాలను వెల్లదీసుకునే వారు ఉంటుండగా ఆస్పత్రుల నుంచి వచ్చే బయో వ్యర్థాలను ఒక్కొక్కటిగా విభజించేందుకు మహిళలను, కొందరు యువకులను ఎంచుకొని వారికి ఎంతో కొంత అందిస్తూ ప్రమాదపుటంచున పని చేయించుకుంటున్నారు. ఇంజక్షన్లు, సిరంజీలు, ఆపరేషన్ల వ్యర్థాలతో పాటు పేషెంట్లకు వాడిన గ్లూకోజ్ బాటిళ్లు, కాటన్, ప్లాస్టిక్ వ్యర్థాలను కూలీలు చేతులతో కనీసం గ్లౌజులు సైతం లేకుండానే విభజిస్తున్నారు. కొన్ని మార్లు పేషెంట్ల రక్తం చేతులకు అంటుకుంటున్నా సాయంత్రం వరకూ పని చేయించుకుంటూనే ఉంటారు. ఈ కల్లు కాంపౌండ్‌లో బయటకు మాత్రం కేవలం ప్లాస్టిక్ వ్యర్థాలు విభజించి అమ్ముతుంటామని ఇక్కడి మాఫియా పేర్కొంటున్నా, లోపలికి వెళ్లి చూస్తే ఒళ్లు గుగుర్పొడిచే విధంగా భయానక వాతావరణం కనిపిస్తోంది. కేవలం మహిళలే కాక వారి పిల్లలు సైతం ఇక్కడ పని చేస్తుండడం విశేషం.

తప్పకుండా చర్యలు తీసుకుంటాం..

బయో వ్యర్థాలతో వ్యాపారం చేయడం నేరం. ఈ వ్యవహారంపై లోతుగా విచారించి ప్రైవేటు ఆస్పత్రులను గుర్తించి వారితో పాటు వ్యాపారం చేసే ముఠాలపై చర్యలు తీసుకుంటాం. గతంలో సైతం ఈవ్యాపారంపై నిర్వాహకులకు నోటీసులిచ్చినా వారు మానలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఇలాంటి వ్యాపారాలు జరుగకుండా తప్పకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

- డాక్టర్ చంద్రశేఖర్, సర్కిల్ 17 వైద్యాధికారి

స్వచ్ఛ టిప్పర్లతో బయో వ్యాపారం

ప్రైవేటు ఆస్పత్రుల నుంచి గుట్టుగా బయో వ్యర్థాలను తెచ్చేందుకు మాఫియా జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ ఆటో టిప్పర్లను వినియోగిస్తోంది. ఉదయం ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించే కార్మికుల్లో కొందరిని వాడుకుంటూ అర్ధరాత్రి ప్రైవేటు ఆస్పత్రుల నుంచి గుట్టుగా బయో వ్యర్థాలను తెప్పించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో కొందరు స్థానికులు మాఫియాకు తెరవెనుక సపోర్టుగా ఉంటూ వారి నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. పాత కల్లు కాంపౌండ్‌తో పాటు ఈ వ్యాపారం గ్రంథాలయం వెనక భాగంలో ఉన్న మరో చోటికి సైతం విస్తరించడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బయోవ్యర్థాల వ్యాపారం సాగుతున్నా, దీనిపై పలు ఫిర్యాదులు వచ్చినా, అటు జీహెచ్‌ఎంసీ గాని, పోలీసులు గాని పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎఫ్‌ఎలు, ఇతర సిబ్బంది ఈ వ్యాపారం చేసేవారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలుస్తోంది.

కూలిన ప్రభుత్వ పాఠశాల గోడ

- తప్పిన ప్రమాదం
- ధ్వంసమైన తోపుడు బండి



కూలిన వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాల గోడ

వెంగళరావునగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల గోడ కూలింది. ఈ ప్రమాదంలో గోడ పక్కన ఉన్న తోపుడు బండి పూర్తిగా ధ్వంసం అయినది. ఈ ఘటన వెంగళరావు నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలోని గోడకు కొద్ది రోజులు పగుళ్లు వచ్చాయి. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా మరమ్మతు పనులు జరుగుతున్నాయి. పాత గోడను తొలగించి నూతనంగా గోడను నిర్మించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితేమంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా గోడ కొంత మేర కూలిపోయింది. పక్కనే ఉన్న తోపుడు బండిపై గోడ కూలిపడంతో పూర్తిగా ధ్వంసమైనది. ఆ సమయంలో గోడపక్కన ఇస్త్రీ చేస్తున్న వారు, రోడ్డుపై వెళ్తున్న వారు పక్కకు తప్పుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. వెంగళరావునగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, ప్రతినిధులు పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మట్లాడగా త్వరలో నూతనంగా గోడను నిర్మిస్తామని తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ రాజేష్‌చారి తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ జీ గోపీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైటెక్ థియేటర్, జూబ్లీహిల్స్ ఫీడర్ల పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఇమేజ్ గార్డెన్స్, సిలికాన్ వ్యాలీ, యూకో బ్యాంక్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏడీఈ తెలిపారు.

గ్రీన్ ల్యాండ్స్ ఫీడర్ పరిధిలో

గ్రీన్ ల్యాండ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఈఎస్‌ఐ స్టాఫ్ క్వార్టర్స్, డీఎస్‌ఎం కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఆర్బీఐ, బేగంపేట నాలా, ఫతే నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సైఫాబాద్ ఫీడర్ పరిధిలో

సైఫాబాద్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, హిందీ ప్రచార సభ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఖైరతాబాద్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.

సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు ప్రారంభం

బంజారాహిల్స్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సాయి సేవా సంఘ్ చారిటబుల్ ఆధ్వర్యంలో సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు మూసాపేట్‌లో సోమవారం ప్రారంభమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా మొదటి రోజు భజన, 99 మంది మహిళలకు వస్త్ర దానం, కోటి సాయినామ జపం కార్యక్రమాలు జరిగా యన్నారు. 20వ తేదీన భజన, 21న భజన, వేద పండితులచే చండీహోమం, 22న భజన, మహాసహస్ర లింగార్చన, 23న పల్లకి సేవ, సత్యసాయి వ్రతాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సర్వే వివరాలు అందజేత



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు మంగళవారం జూబ్లీహిల్స్‌లోని సినీనటుడు అక్కినేని నాగార్జున ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి అక్కినేని అమల ఎన్యూమరేటర్లకు వివరాలు అందజేశారు. *- (హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)*

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రగడ్డ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. మంగళవారం ఆమె జయంతిని పురస్కరించుకొని ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దూడల రవి గౌడ్ ఆధ్వర్యంలో హేమవతి నగర్‌లో ఆమె చిత్రపటానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, గంటా మల్లేష్, మహ్మద్ సర్దార్, మహ్మద్ ఖాజా పాషా, అంజయ్య గౌడ్, మహ్మద్ జాంగీర్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రహ్మత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్‌లోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

- యూసుఫ్‌గూడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి)

పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ కృషి



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ పీవీ రవి శేఖర్ రెడ్డి

పంజాగుట్ట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): దేశంలో హరిత విప్లవం రావడానికి, పేదరిక నిర్మూలనకు కృషి చేసిన ఘనత మాజీ ప్రధాని ఇందిరా గాంధీకే దక్కుతుందని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ స్వచ్ఛంద సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవి శేఖర్ రెడ్డి అన్నారు. వెంగళరావునగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వెంగళరావునగర్ కాలనీలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

21 నుంచి 24 వరకు ఫిష్ ఫెస్టివల్

అఫ్జల్‌గంజ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుని ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నగరంలో ఫిష్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ ప్రారంభిస్తారని, రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు హాజరవుతారని తెలిపారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద, ఐమాక్స్ థియేటర్ వద్ద ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి మత్స్యకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హాస్టల్ నుంచి విద్యార్థిని అదృశ్యం



అఖిల (ఫైల్)

ఖైరతాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో ఉన్న హాస్టల్ నుంచి విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నెక్కొండకు చెందిన రేకుల తండాకు చెందిన బడావత్ అఖిల(21) సైఫాబాద్ హోంసైన్స్ కళాశాలలో బీఎస్సీ 3వ సంవత్సరం చదువుతూ కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 17న మధ్యాహ్నం ఆరోగ్యం బాగాలేదు డాక్టర్ వద్దకు వెళ్లి వస్తానని హాస్టల్ వార్డెన్‌కు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వార్డెన్ తోటి విద్యార్థులతో పాటు ఇతరులను విచారించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. అఖిల తండ్రి బడావత్ నర్సింహ ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో లేదా తనను సంప్రదించాలని ఏఎస్‌ఐ శ్రీరాములుతెలిపారు.

పార్కింగ్ భవన నిర్మాణ సామగ్రి కోసం

నడిరోడ్డుపై రేకులతో ఆక్రమణ

- ఎల్లమ్మ ఆలయం వద్ద రెండేళ్లుగా కొనసాగుతున్న పనులు
- ఇరుకుగా మారిన రోడ్డుతో వాహనదారులు, పాదచారుల అవస్థలు



బల్కంపేట ఎల్లమ్మ ఆలయం పార్కింగ్ భవనం ముందు నడిరోడ్డుపై ఏర్పాటు చేసిన బ్లూ షీట్స్

అమీర్‌పేట, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం బోనం కాంప్లెక్స్ పక్కన నిర్మిస్తున్న పార్కింగ్ భవనం కోసం నిర్మాణ సామగ్రిని నిల్వ చేసేందుకు నడిరోడ్డుపై ఏర్పాటు చేసిన బ్లూ షీట్లతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వాహనాలను పార్క్ చేసే స్థలం లేక పోవడంతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వివిధ ప్రాంతాలను నుంచి వస్తున్న భక్తులు తమ వాహనాలను ఈ రోడ్డు పరిసరాల్లో పార్కింగ్ చేస్తుండడంతో సమస్య మరింత జటిలమవుతుంది. బీకే గూడ నుంచి ఆలయం వైపు, ఆలయం నుంచి బీకే గూడ వైపు వెళ్లే వాహనదారులు ఇందులో ఇరుక్కుని ముందుకు పోలేక, వెనక్కు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య గత రెండు సంవత్సరాలుగా నెలకొన్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఈ విషయమై పలుమార్లు ఆలయ అధికాలకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పార్కింగ్ భవన నిర్మాణం కోసం కాంట్రాక్టర్ 2022 సంవత్సరంలో నడిరోడ్డుపై బ్లూషీట్లను ఏర్పాటు చేశారు. కాగా, ముందస్తు ఒప్పందం ప్రకారం.. మూడు ఫ్లోర్లను నిర్మించి, చేసిన పనులకు డబ్బులు చెల్లించాలని రెండు దఫాలుగా పనులను నిలిపి వేశారు. పార్కింగ్ భవనం పనులు నిలిచిపోయినప్పటికీ రోడ్డుపై ఏర్పాటు చేసిన షీట్లను మాత్రం తొలగించడం లేదు.

బ్లూషీట్లను వెంటనే తొలగించాలి



పార్కింగ్ భవనం ముందు రోడ్డుపై ఏర్పాటు చేసిన బ్లూషీట్ల వల్ల రోడ్డు ఇరుకుగా మారడంతో ఆలయానికి వాహనాలపై వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆది, మంగళవారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండడం వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి. వెంటనే ఈ సమసను పరిష్కరించాలి

- కడవారి లక్ష్మణ్, అద్దె రూమ్ నిర్వాహకుడు

రెండు సంవత్సరాలుగా సమస్య



పార్కింగ్ భవన నిర్మాణం కోసం కాంట్రాక్టర్ నడిరోడ్డుపై ఏర్పాటు చేసిన బ్లూషీట్ల మూలంగా నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. భవన నిర్మాణ పనులు నిలిచి పోయినప్పటికీ ఆ షీట్లను తొలగించడం లేదు. రెండు సంవత్సరాలుగా ఈ సమస్యతో భక్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వీటిని తొలగించి సమస్య సమస్య పరిష్కరించాలి.

- గౌలికార్ యాదిలాల్, స్థానికుడు

సర్వే నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి



బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల సమావేశంలో ప్రతినిధులు

అడ్డగుట్ట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కో-ఆర్డినేటర్ ఏవీఎం స్వామి ప్రభుత్వాన్ని కోరారు. అడ్డగుట్ట డివిజన్‌లోని ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్వామి మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకే పాఠశాలలను నడపడం వలన ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అనుకున్న సమయానికి సిలబస్ పూర్తి కావడం లేదన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలు 200 పనిదినాలు, 800 బోధనా గంటలుగా నిర్ధారించినట్లు గుర్తుచేశారు. జనాభా కులగణన, కుటుంబ సర్వే, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. సర్వే కారణంగా ప్రభుత్వ పాఠశాలలు మూసివేయడం వల్ల విద్యార్థుల చదువులపై ప్రభావం చూపే అవకాశముందన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, చిన్న వీరయ్య, గోపాల్, భాస్కర్, దివ్య, శ్రీకాంత్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు సువర్ణ, భాగ్య, సుమలత, లావణ్య అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్ డివిజన్‌లోని సమస్యలను పరిష్కరిస్తాం



బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లోని ప్రజాసమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు కంది శైలజ అన్నారు. మంగళవారం ఎల్‌నారాయణనగర్‌లో నూతనంగా చేపడుతున్న పవర్‌బోర్‌వెల్ పనులను స్థానికులతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవర్‌బోర్‌వెల్ పనులు పూర్తి అయితే స్థానికులకు కొంతమేర నీటి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, నాయకులు మంద జగన్, శ్రీధర్, బాబు, మల్లేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తాం



సింహగర్జన పోస్టర్లను చూపుతున్న ఎమ్మెల్యే వివేక్ తదితరులు

అడ్డగుట్ట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని అంబేడ్కర్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీఎన్ సుధాకర్ అన్నారు. సోమవారం రాత్రి 10 గంటలకు తుకారాంగేట్ చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ డిసెంబరు 1న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే సింహగర్జన సభకు మాలలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మహేందర్, రమాదేవి, రాంచందర్, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమం కోసం పనిచేస్తా : వసంత్



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంత్ కుమార్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

అడ్డగుట్ట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమం కోసం పనిచేస్తానని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. వసంత్‌కుమార్ అన్నారు. తెలంగాణ న్యాయవాదుల మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ 25 ఏళ్ల వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం రాత్రి సికింద్రాబాద్ సివిల్ కోర్టు ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన వసంత్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులకు ఏ కష్టం వచ్చినా అసోసియేషన్ తరపున అండగా ఉంటామన్నారు. న్యాయవాదులకు రూ. 6 లక్షల బీమా ఇన్సూరెన్స్, వైద్యం కోసం రూ. 2 లక్షలు అసోసియేషన్ అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దేశ్‌ముఖ్, డైరెక్టర్లు రవి, రామయ్యనాయుడు, మాజీ డైరెక్టర్ సుధాకర్, బాలేష్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుశీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు టీవీ రమణ, సంయుక్త కార్యదర్శి బుచ్చిబాబు, గంగాధర్ శెట్టి, ప్రవీణ్‌కుమార్, పుష్పలత, సౌమ్య, కిరణ్ కుమార్, బాలరాజు, సంతోష్, హిమవర్ధ తదితరులు పాల్గొన్నారు.

బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యం



సురక్ష క్లబ్‌ను ప్రారంభిస్తున్న లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్, ఉమెన్ సేఫ్టీవింగ్ ప్రతినిధులు

రెజిమెంటల్‌బజార్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): బాలికలకు వ్యక్తిగత భద్రతా వైఖర్యాలు నేర్పించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యం అని లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కౌముది అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ కీస్ హైస్కూల్‌లో లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో సురక్ష క్లబ్ సేఫ్టీ వీక్ కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు వ్యక్తిగత భద్రతా వైఖర్యాలు, హక్కులు, రక్షణపై అవగాహన కల్పించారు. బాలికలకు సురక్షిత వాతావరణాన్ని అందించడానికి ఐదుగురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులతో సురక్ష క్లబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్ అదనపు ఎస్పీ లక్ష్మీ, డీఎస్పీ శేఖర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ హరీష్, గీతామాధురి, స్కూల్ ప్రిన్సిపాల్ జ్ఞాని తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు



ఫుట్‌పాత్‌పై దుకాణాల తొలగింపులో పాల్గొన్న సిబ్బందితో ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజ్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్

బోయిన్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు నుంచి తిరుమలగిరి, సికింద్రాబాద్ వైపునకు వెళ్లే రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను ట్రాఫిక్ పోలీసులు, కంటోన్మెంట్ బోర్డు సిబ్బందితో కలిసి తొలగించారు. ఏసీపీ జి.శంకర్‌రాజ్, బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యాపారాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడంతోపాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది, అధికారులు, బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఎస్ఐలు కెవీచేదన్, సాయికృష్ణ ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్ పోలీసులు పాల్గొన్నారు.

బ్లేడుదాడి ఘటనలో 8 మంది అరెస్ట్

- నిందితులకు 15 రోజుల జైలు

బోయిన్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్లేడు దాడి ఘటనలో 8 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం నిందితులకు 15 రోజుల జైలు శిక్ష విధించింది. బోయిన్‌పల్లి డీఐ సర్దార్ నాయక్, ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన నితిన్, చందన్‌కుమార్ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కొన్నేళ్లుగా బోయిన్‌పల్లిలోని 'హోల్‌సేల్ అన్ లిమిటెడ్' సంస్థలో పెట్టి సొంతంగా నడుపుకుంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అదే సంస్థలో పనిచేస్తున్న బోయిన్‌పల్లి అనంద్‌నగర్‌కు చెందిన యువకులు అరవింద్, సాయి, తేజ, ఖాన్, ఫైజాన్, బన్నీ, జీవితర్, గౌడ ఇద్దరు యువకులు ఓ పార్టీలో ఉండగా విషయంలో ఫోన్‌లో నితిన్, చందన్‌కుమార్‌తో గొడవపడ్డారు. మద్యం మత్తులో ఉన్న అరవింద్, సాయి, తేజ, ఖాన్, ఫైజాన్, బన్నీ జీవితర్ గౌడ్ ప్రాంతం వద్దకు చేరుకొని నితిన్, చందన్‌కుమార్‌లను పిలిపించారు. వారు అక్కడికి రాగానే మాటామాట పెరిగి ఒకరినొకరు తోసుకున్నారు. కోపంతో రగిలిపోయిన సాయి తన వద్ద ఉన్న బ్లేడుతో నితిన్, చందన్ కుమార్‌లపై దాడిచేసి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి సాయి అతడికి సహకరించిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. మంగళవారం తెల్లవారుజామున పరారీలో ఉన్న మరో ఇద్దరిని అరెస్ట్ చేసి మొత్తం 8 మంది యువకులను కోర్టులో హాజరుపర్చగా, ఒక్కొక్కరికి 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. దాంతో 8 మందిని జైలుకు తరలించామని తెలిపారు.

నీటికోసం తిప్పలు

- నిరుపయోగంగా చేతిపంపులు, బోర్లు
- తాగునీరు సరఫరా అవుతున్నా ఇతర అవసరాలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేయాలంటున్న అంబేద్కర్‌నగర్ బస్తీ వాసులు



పాడైన చేతిపంపు



ఇళ్ల మధ్య పారుతున్న మురుగు



నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

మారేడుపల్లి నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఆ బస్తీలో అన్నీ సమస్యలే. తాగునీటి ఇబ్బందులు, ఇళ్ల ముందే పారుతున్న మురుగు నీరు, పనిచేయని గంటేసి చేతి పంపులు ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది మోండా మార్కెట్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ మారేడుపల్లి అంబేద్కర్ నగర్ బస్తీ వాసుల దుస్థితి. ఇక్కడ 350 పక్కా ఇళ్లతోపాటు మరో 35 గుడిసెలలో దాదాపు 2,500 మంది నివసిస్తున్నారు. జలమండలి ఆధ్వర్యంలో రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నది. అయితే ఈ నీరు బస్తీలోని ప్రజల ఇతర అవసరాలకు సరిపోకపోవడంతో చేతిపంపులు, బోర్లపై ఆధారపడ్డారు. గత ప్రభుత్వాల్లో 5 చేతి పంపులు, రెండు పవర్ బోర్లను, ఒక వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవన్నీ పాడై పోయాయి. మూడేళ్ల నుంచి తాగునీటికి, ఇతర అవసరాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెడిపోయిన చేతిపంపులు, పవర్ బోర్లకు మరమ్మతులు చేయాలని పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు మండిపడుతున్నారు. అదేవిధంగా బస్తీ సమీపంలో దసలక్ష్మీ స్టోర్ ముందుగల చేతిపంపు నిరుపయోగంగా మారి ఉంది. ఈ చేతిపంపు అవసరం బస్తీ ప్రజలకు ఎంతో ఉందని. ఆపద సమయంలో బస్తీ వాసులు ఇక్కడికి వచ్చి నీటిని తీసుకువెళ్లి కార్యక్రమాన్ని ముగించుకునేవారు. ప్రస్తుతం అది కూడా నిరుపయోగంగా మారింది. ఇక మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలను తొలగించకపోవడతో మురుగునీరు ఇళ్ల మధ్య పారుతుందని వాపోయారు. బస్తీ ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బోర్లకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు. అంబేద్కర్‌నగర్ బస్తీలో వర్షపు నీరు నిల్వకుండా ఏర్పాటు చేసిన వైప్ లైన్లు, మ్యాన్‌హోళ్లలో చెత్త, వ్యర్థాలతో నిండిపోయాయి. దాంతో ఎగువ ప్రాంతాల నుంచి దిగువనకు వస్తున్న మురుగునీరు బస్తీలోని ఇళ్ల మధ్య పారుతుంది. వర్షపు నీటి పైపులైన్లలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో తరచూ సమస్య ఉత్పన్నమవుతుంది. అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లలో పూడికతీత పనులు చేపట్టాలని బస్తీవాసులు కోరుతున్నారు.

ఎగువ ప్రాంతాల నుంచి కిందకు వరద



ఎగువ ప్రాంతాలైన టీచర్స్ కాలనీ, ఈస్ట్ మారేడుపల్లి నుంచి దిగువనున్న అంబేద్కర్ నగర్ బస్తీలో వరదనీరు వస్తుంది. లోతట్టు ప్రాంతం కావడంతో ఎప్పుడు ముంపునకు గురవుతామోనని ఆందోళన చెందుతున్నాం. వర్షపు నీరు సాఫీగా కిందకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. బస్తీలో చెడిపోయిన చేతిపంపులు, పవర్ బోర్లు, వాటర్ ట్యాంక్‌ను బాగు చేయాలి.

- పోచయ్య, అంబేద్కర్‌నగర్ బస్తీ

మ్యాన్‌హోళ్లలో పూడిక తీయాలి



అంబేద్కర్‌నగర్ బస్తీలోని సమస్యలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వర్షపునీటి మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలి. పూడికతీత పనులు చేపట్టాలి. చేతి పంపులు, పవర్ బోర్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

- రౌతు రాజయ్య, అంబేద్కర్‌నగర్ బస్తీ



మోండా మార్కెట్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు



అడ్డగుట్టలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్ యాదగిరి

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళులు



తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

రెజిమెంటల్‌బజార్/సికింద్రాబాద్/అడ్డగుట్ట/బోయినపల్లి/తార్నాక, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మోండా మార్కెట్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గరీబీ హఠావో' నినాదంతో దేశంలో పేదరిక నిర్మూలనకు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కృషి చేశారని అన్నారు. బ్యాంకుల జాతీయకరణ ద్వారా బ్యాంకింగ్ సేవలను పేదలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆల్మెడి గోకేందర్, నందికంటి రవి, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, అడ్డగుట్టలో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. యాదగిరి, బోయినపల్లిలో కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తదితరులు ఇందిరాగాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఓయూ జేఏసీ, యూత్ కాంగ్రెస్ నాయకులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ విద్యార్థి నాయకులు నోముల శేషు, భగత్ సింగ్, సూరి, నిఖిల్, గణేష్, అభిలాష్, రాకేష్, తేజ, మహేష్, నిరంజన్ పాల్గొన్నారు.



బోయినపల్లి పంప్‌హౌజ్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్



ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సైదులు యాదవ్ తదితరులు

దివ్యాంగుల పాఠశాలలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

హైదరాబాద్ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలో దివ్యాంగుల సంక్షేమానికి నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలను వివిధ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమాధికారి రాజేందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఆశ్రమాలు, సంస్థలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దివ్యాంగుల సంక్షేమ చట్టం-2016 ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం నవంబర్ 25లోపు జిల్లాలోని దివ్యాంగుల, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. నవంబర్ 25లోపు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోని సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూర్తి వివరాలకు 96404 52773 సెల్‌ఫోన్ లేదా టోల్‌ఫ్రీ నంబర్ 155326లో సంప్రదించాలన్నారు.

నామమాత్రంగా కుటుంబ సర్వే

- ఒకే చోట కూర్చుని వివరాలను సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు

బౌద్ధనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి కుటుంబసమగ్ర సర్వే గాడితప్పుతుంది. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లకుండా ఒక చోట కూర్చుని నామమాత్రంగా చేస్తున్నారు. మంగళవారం వారాసిగూడ డవిజన్‌లోని పోచమ్మ ఆలయం వీధిలో ఇంటినెంబర్ 12-11-435/ఏ/1 వద్దకు వచ్చిన ఎన్యూమరేటర్ ఒకచోట కుర్చీ వేసుకుని అందరిని పిలుచుకుని వివరాలను సేకరించారు. ఒక భవనంలో ఆరు కుటుంబాలు నివాసముంటుండగా కేవలం ఒకరి, ఇద్దరి నుంచే వివరాలను సేకరించింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఎన్యూమరేటర్‌ను వివరణ కోరగా అధికారులు ఇంటింటికి వెళ్లకుండా ఒకచోట కూర్చొని వివరాలు సేకరించమన్నారని తెలిపింది. ఆ వీధిలో ఉంటున్న చాలామందికి సర్వే చేస్తున్నారన్న విషయమే తమకు తెలియదన్నారు.కాగా ప్రతి ఎన్యూమరేటర్ తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీచేశామని జనార్ద్ తెలిపారు.

కుటుంబ వివరాలిచ్చిన డిప్యూటీ మేయర్

తార్నాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు మంగళవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. తన నివాసానికి వచ్చిన అధికారులకు కుటుంబ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ చారిత్ర, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.



యాదగిరికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

టీపీసీ సభ్యుడిగా యాదగిరి

బౌద్ధనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అడ్వయిజరీ కమిటీ(టీపీసీ) సభ్యుడిగా సీతాఫల్‌మండికి చెందిన యాదగిరి నియమితులయ్యారు. ఈ మేరకు ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఏఎంసీ చైర్మన్ జగదీశ్వర్‌రావు, సురేశ్, నాయకులు జహంగీర్, రాజు, పాపారావు, రేవంత్, జలీల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోయిన్‌పల్లి, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల నరికివేత, వివిధ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ గోపాలరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చందన హాస్పిటల్, ఆనంద్‌నగర్, అమరజ్యోతి కాలనీ, భావనకాలనీ, సెంటర్ పాయింట్, గణేష్ టెంపుల్, ఎస్‌వీటీ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయిబాబా టెంపుల్, చిన్నతోకట్ట, జయనగర్ కాలనీ, మల్లారెడ్డి రెసిడెన్సీ, ఎస్‌ఆర్ ప్లాజా, జీవీ అపార్ట్‌మెంట్స్, ఏపీఎం అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ గోపాలరావు తెలిపారు.

సత్య సాయిబాబా జయంతి వేడుకలు ప్రారంభం

బంజారాహిల్స్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సాయి సేవా సమితి చారిటబుల్ ఆధ్వర్యంలో సత్య సాయిబాబా 99వ జయంతి వేడుకలు మూసాపేటలో సోమవారం ప్రారంభమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు భజన, 99 మంది మహిళలకు వస్త్రదానం, కోటి సాయినామ జపం కార్యక్రమాలు జరిగాయన్నారు. 20వ తేదీన భజన, 21న భజన, వేద పండితులచే చండీహోమం, 22న భజన, మహాన్నదానం జరుగుతాయని, 23న పల్లకి సేవ, సత్సంగం ప్రముఖుల తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో ఓ వృద్ధుడు మృతిచెంది ఉన్నాడని సమాచారం అందింది. సికింద్రాబాద్ రైల్వేపోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 60 ఏళ్లు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హాస్టల్ నుంచి విద్యార్థిని అదృశ్యం



అఖిల

ఖైరతాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన రేణుక తండాకు చెందిన బదావత్ అఖిల (21) సైఫాబాద్ హోంసైన్స్ కళాశాలలో బీఎస్సీ 3వ సంవత్సరం చదువుతూ కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 17న మధ్యాహ్నం ఆరోగ్యం బాగాలేదని డాక్టర్ వద్దకు వెళ్లివస్తానని హాస్టల్ వార్డెన్‌కు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వార్డెన్ తోటి విద్యార్థులతోపాటు ఇతరులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అఖిల తండ్రి బదావత్ నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దొంగల ముఠా అరెస్ట్

మూడు బైక్‌లు, విడి భాగాలు స్వాధీనం



బైక్ దొంగల ముఠా వివరాలు చూపుతున్న ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రాంబాబు

రాంనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగిలిస్తున్న ఇద్దరిని, వాహనాల విడిభాగాలను కొనుగోలు చేసే వ్యాపారిని ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ముషీరాబాద్ సీఐ రాంబాబు, డీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. భోలక్‌పూర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ పాషుద్దీన్, ఇర్ఫాన్, ఎండీ మోహిన్ హుస్సేన్ కొంత కాలంగా ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన బైక్‌లను పార్ట్‌లుగా విడదీసి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి కదలికలపై ముషీరాబాద్ క్రైమ్ పోలీసులు నిఘాపెట్టారు. ఈ క్రమంలో భోలక్‌పూర్‌లోని హోటల్ ఖాజా వద్ద దొంగిలించిన వాహనాల విడి భాగాలు విక్రయించేందుకు పాషుద్దీన్, ఇర్ఫాన్, మోహిన్ హుస్సేన్ యత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మోహిన్ హుస్సేన్ తప్పించుకుని పారిపోగా, పాషుద్దీన్, ఇర్ఫాన్‌తోపాటు కొనుగోలుదారుడు అన్వర్ హుస్సేన్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు ద్విచక్రవాహనాలు, విడిభాగాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పారిపోయిన మోహిన్ హుస్సేన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.